



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వర స్వామి



విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్న కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధి

శివ పూజకు వేళాయె

నేడే మహా శివరాత్రి తిరునాళ్ల



కోటప్పకొండపై నందీశ్వరుడికి అభిషేకం



ప్రత్యేక అలంకరణలో గోవాడ బాలకోటేశ్వరస్వామి



విద్యుత్ వెలుగుల్లో పెదకాకాని ఆలయం



అమరావతిలో చలువ పందిళ్లు



క్వారీ ఆలయం వద్ద ఏర్పాట్లు

- విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా కోటప్పకొండ
- తిరునాళ్లకు త్రికూటాద్రి ముస్తాబు
- గ్రామాల నుంచి కొండకు పయనమైన విద్యుత్ ప్రభలు
- కోటయ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఆనం
- అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభం
- అమరావతి, కాకాని, గోవాడ, క్వారీ సహా శైవక్షేత్రాల్లో భారీగా ఏర్పాట్లు

మహా శివరాత్రికి.. శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. విద్యుత్ వెలుగుల్లో కోటప్ప కొండ సహా శైవక్షేత్రాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలతో ఉత్సవాలను ప్రారంభించేందుకు అర్చకులు, అధి కారులు సకలం సిద్ధం చేశారు. భారీగా తరలివచ్చే భక్తుల కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. కోటప్ప కొండ, అమరావతి, పెదకాకాని, క్వారీ, గోవాడ క్షేత్రాలు ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. చేదుకో కోటయ్య.. చేదుకో అంటూ భక్తులు ప్రభలతో తిరునాళ్లకు తరలి వస్తున్నారు. శ్రీ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల బుధవారం నేత్ర పర్వంగా జరగనుంది. ప్రభల పండుగగా పిలిచే కోటయ్య తిరునాళ్లకు 19 భారీ విద్యుత్ ప్రభలు కొండకు పయనమయ్యాయి. ప్రభలు తరలివచ్చే మార్గంలో ఎటువంటి అవాంతరాలు కలగకుండా నిర్వాహకులతో పాటు అధికారులు కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ వెలుగుల్లో కొలువుదీరే ప్రభలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరానుండటంతో సాంస్కృతిక కార్యక్ర మాలను నిర్వా హకులు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు కోటప్పకొండలోని శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధికి తరలిరానున్నారు. ఆయా ఆలయాల్లో స్వామి వార్ల దర్శ నాలకు, ప్రత్యేక పూజలకు తరలివచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లతో క్యూలు ఏర్పాటు చేశారు.

8



తిరునాళ్ళకు గురవాయపాలెంలో నిర్మించిన భారీ విద్యుత్ ప్రభ

ముగిసిన ప్రచారం



ఏసీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ తదితరులు

- రేపు పట్టభద్రుల పోలింగ్
- ఆరు జిల్లాల పరిధిలో 483 కేంద్రాలు
- నేడు బ్యాలెట్ బాక్సులతో కేంద్రాలకు సిబ్బంది
- ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నేడు, రేపు డ్రై డే

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల నియోజక వర్గ ఎన్నికలకు సంబంధించి ప్రచారం ముగిసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రచార కార్యక్రమాలు నిలిచిపోయాయి. చివరి రోజు కావడంతో మంగళవారం ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు వివిధ వర్గాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. చివరి రోజైన మంగళవారం జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీడియో ద్వారా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించాల్సిందిగా సందేశమిచ్చి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. మరోవైపు పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు వివిధ సంఘాలు, యూనియన్లను కలుసుకుని మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల బరిలో ఉన్న మిగతా అభ్యర్థులు ఆటోల ద్వారా మైకు ప్రచారం నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా కూడా పలువురు అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఆరు జిల్లాల పరిధిలోని 483 పోలింగ్ కేంద్రాల్లో గురువారం పోలింగ్ జరగనుంది. కాగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి తెలిపారు.

పోలింగ్‌పై అభ్యర్థుల దృష్టి

ఎన్నికల ప్రచారం ముగియడంతో అభ్యర్థులంతా పోలింగ్ రోజుపై దృష్టి సారించారు. గురువారం ఓటర్లను చైతన్యపరిచి పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చేలా చేయాలని అభ్యర్థులు, వారి అనుచరులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తం 3 లక్షల 47 వేల 116 మంది ఓటర్లున్న దృష్ట్యా పోలింగ్ శాతం ఎంత పెరిగితే అంత తమకు మేలు జరుగుతుందని కూటమి నేతలు భావిస్తున్నారు. అయితే గత ఎన్నికల్లో వేల సంఖ్యలో ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. ఈ దృష్ట్యా పోలింగ్ శాతం పెరిగినా అవి వ్యాలిడ్ ఓట్లు అయితేనే మేలు జరుగుతుంది.

సజావుగా డిస్ట్రిబ్యూషన్ జరగాలి

డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల వద్ద రద్దీ లేకుండా సజావుగా ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందించాలని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్ సరిచూసుకున్న సిబ్బందిని సురక్షితంగా రూట్ల ప్రకారం పోలింగ్ స్టేషన్లకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరులోని ఏసీ కళాశాలలో రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను మంగళవారం ఆమె సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనాసిన్హాలతో కలిసి పరిశీలించారు. ప్రధానంగా డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల వద్ద సైనేజ్ బోర్డులను ఎన్నికల సిబ్బంది గుర్తించేలా ఉండాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్ల వద్ద ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అల్పాహారం, మంచినీరు, శుచి శుభ్రమైన భోజనాలు అందించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు అందించారు. గురువారం ఓటింగ్ అనంతరం పోలింగ్ బూత్‌ల నుంచి తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం సురక్షితంగా భద్రపరచేందుకు గదులను పరిశీలించారు. ఏసీ కాలేజీలోని ప్రేయర్ హాల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆర్‌డీవో కే శ్రీనివాసరావు, గుంటూరు తూర్పు, పశ్చిమ మండల తహసీల్దార్లు నగేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలు బంద్

గుంటూరు(కార్పొరేషన్): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధ, గురువారాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాలు నిలిపివేస్తున్నట్లు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సాయంత్రమే వైన్‌షాపులకు, బార్లకు తాళాలు వేసినట్లు తెలిపారు. ఆయా బార్లు, వైన్‌షాపుల్లో రెండు రోజుల పాటు మద్యం అమ్మకాలను పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో వచ్చే నెల 3న కూడా మద్యం విక్రయాలను నిషేధించినట్లు తెలిపారు.

34 రోజులు.. రూ.304 కోట్లు

- ఆస్తిపన్ను వసూళ్లలో రెవెన్యూ అధికారుల ముందున్న లక్ష్యం



6

- ఉమ్మడి జిల్లా మునిసిపాలిటీల్లో వసూళ్లు అంతంతమాత్రమే..
- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా దరిచేరని లక్ష్యం
- ఇప్పటికీ 70 శాతం దాటని వసూళ్లు..
- వినుకొండలో అత్యధికంగా... చిలకలూరిపేటలో అత్యల్పంగా..
- ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినా ప్రయోజనం శూన్యం

ఇన్‌చార్జిల పాలన

- ఎన్జీ రంగా వర్సిటీపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే నియామకాలు
- ఏడాదిగా అతీగతి లేని పాలకవర్గం నియామకం
- రాష్ట్ర విభజన తర్వాత మంజూరు కాని పోస్టులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైస్ చాన్సలర్, కంప్ట్రోలర్, అగ్రికల్చర్, ఇంజనీరింగ్, కమ్యూనిటీ సైన్సు, స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్లు, రీసెర్చ్, ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్లు, రిజిస్ట్రార్, కంప్ట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్.. ఇలా ఒకటి కాదు రెండు కాదు కీలకమైన మొత్తం పోస్టుల్లో ఇన్‌చార్జిలే దిక్కు. ఇదీ గత కొన్నేళ్లుగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీలో జరుగుతున్న ఇన్‌చార్జిల పాలన. ఇన్‌చార్జిల పాలనతో అనేక నష్టాలు జరుగుతున్నా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించడంలేదు. వర్సిటీకి చెందిన రూ.400 కోట్ల బడ్జెట్ వ్యవహారాలు ఇన్‌చార్జి కంప్ట్రోలర్ చూస్తున్నారంటే ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వం యూనివర్సిటీని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ఒకటి రెండు పోస్టులు మాత్రమే వచ్చాయి. మిగిలిన వాటిని ప్రభుత్వం కొత్తగా మంజూ రు చేయాలి. వాటికి హయ్యర్ ఎడ్యుకేషన్, ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలి. ఆ తదుపరి పూర్తిస్థాయిలో నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులను నియమించాలి. కానీ ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీలో ఈ ఏర్పాటు లేకుండానే పనులు సాగుతున్నాయి. ఎప్పటికప్పుడు తాత్కాలిక పద్ధతిలో చేపడుతున్న నియామకాలు వివాదాస్పదం గా మారుతున్నాయి.



ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ

మూడు నెలలే...

ప్రస్తుతం ఉన్న కీలకమైన పోస్టులన్నీ మూడు నెలల తాత్కాలిక పద్ధతిపై(రీ డిప్లాయ్‌మెంట్) భర్తీ చేస్తున్నారు. వీసీకి అనుగుణంగా ఉన్న వారిని నియమించడం ఆనవాయితీగా మారింది. గవర్నర్‌తో పనిలేకుండా ఆయా పోస్టుల్లో మూడు నెలలకి ఒకసారి నియామకం చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని రకాలుగా ప్రాబల్యం ఉన్న వారికి మాత్రమే కీలక పోస్టులు దక్కుతున్నాయన్న వాదన ఉంది. గత ప్రభు త్వంలో పూర్తిగా ఒక పార్టీకి, ఒక వర్గానికి చెందిన వారికి మాత్రమే ప్రాధాన్యం దక్కిందన్న ఆరోపణలున్నాయి.

వివాదాలు..

వర్సిటీలోని కీలకమైన పోస్టుల్లో ఇన్‌చార్జిలే ఉండటంపై తీవ్రవివాదం నెలకొంది. ఇప్పటికే పలు ఆరోపణలు వస్తుండటం.. కొందరు ఈ విషయాలను గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తుంది. రెన్యూవల్ పద్ధతికి స్వస్తి పలికి శాశ్వత నియామకాలు చేపట్టాలన్న డిమాండ్ వస్తోంది. ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ విడుదలతో అర్హులకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయం ఉంది. వ్యవసాయ రంగంలో కీలకపాత్ర పోషించే ఎన్జీ రంగా వర్సిటీకి ప్రభుత్వం తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు పాలకవర్గం లేకపోవడం గమనార్హం. ఏడాదిగా బోర్డు ఏర్పాటు కాలేదు. బోర్డు నియామకంపై త్వరితగతిన చర్యలు చేపట్టాలన్న సూచనలు వస్తున్నాయి.



ఆటోనగర్‌లోని విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీ చేస్తున్న ఏడీ ఏ లు శ్రీనివాసరావు, సుదర్శన్ రాజు తదితరులు

ఆటోనగర్‌లో వ్యవసాయశాఖ తనిఖీ

● విత్తనాల ప్రాసెసింగ్‌యూనిట్ల పరిశీలన.. ఎగుమతులపై ఆరా

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని ఆటోనగర్‌లో వ్యవసాయశాఖ విస్తృత తనిఖీలు నిర్వహించింది. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'నకిలీ విత్తనాల అడ్డా.. ఆటోనగర్' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తపై వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం స్పందించింది. జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు నేతృత్వంలో మూడు బృందాలుగా అధికారులు ఆటోనగర్‌లోని 10 విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీ చేశారు. జూట్ ఎగుమతి అనుమతి పొందిన రెండు ప్రాసెసింగ్ యూనిట్ల అనుమతి పత్రాలను పరిశీలించి ప్రభుత్వ అనుమతి ఉన్నట్లు గుర్తించారు. నేషనల్ సీడ్ కార్పొరేషన్ యూనిట్ నుంచి 5200 క్వింటాళ్ల జూట్ విత్తనాల, తేజస్వి సీడ్స్‌కు 1072 క్వింటాళ్ల జూట్ విత్తనాల ఎగుమతికి అనుమతులు గుర్తించారు. మినుము, కంది, పెసర వంటి విత్తనాలు ప్రాసెసింగ్ చేస్తున్న యూనిట్లను పరిశీలించారు. పత్తి విత్తనాలు ప్రాసెస్సింగ్ ఆరంభం కాలేదని గుర్తించారు. నగరంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలను అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీల్లో ఏడీఏలు సుదర్శన్ రాజు, తోటకూర శ్రీనివాసరావు, కె.అన్నపూర్ణమ్మ, ఐ.సునీత, ఏవోలు సునీల్‌కుమార్, గౌతమ్‌ప్రసన్న, ఖడ్గం రమణకుమార్, పాల్గొన్నారు.

కుడి కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి

దుర్గి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పుల వద్ద నాగార్జునసాగర్ కుడికాలువలో ఈతకు దిగి గల్లంతైన గుట్టపల్లి అయ్యప్ప(28) మృతదేహం నకరికల్లు మండలం గుళ్లపల్లి వద్ద మంగళవారం లభ్యమైంది. నరసరావుపేట ఎన్జీవోకాలనీకి చెందిన అయ్యప్ప ఆదివారం మండలంలోని అడిగొప్పులలో నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని దర్శించుకొని తిరిగి వెళ్తూ మార్గమధ్యంలోని అడిగొప్పుల కుడి కాలువలో ఈతకు దిగి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్ గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

34 రోజులు.. రూ.304 కోట్లు

● ఆస్తిపన్ను వసూళ్లలో రెవెన్యూ అధికారుల ముందున్న లక్ష్యం
● ఉమ్మడి జిల్లా మునిసిపాలిటీల్లో వసూళ్లు అంతంతమాత్రమే..
● ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా దరిచేరని లక్ష్యం
● ఇప్పటికీ 70 శాతం దాటని వసూళ్లు..
● వినుకొండలో అత్యధికంగా... చిలకలూరిపేటలో అత్యల్పంగా..
● ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినా ప్రయోజనం శూన్యం

గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మార్చి 31వ తేదీ నాటికి 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా మున్సిపాలిటీలలో ఆస్తిపన్ను వసూలుకి ఇక కేవలం 34 రోజులు వ్యవధి మాత్రమే ఉంది. ఇప్పటివరకు రూ.202 కోట్లు మాత్రమే వసూలు కాగా, ఇంకా రూ.304 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ప్రతి రోజు రూ 8.90 కోట్ల వసూలు చేస్తేనే 34 రోజుల్లో మొత్తం ఆస్తి పన్ను వసూలు సాధ్యమవుతుంది. లేకుంటే ఈ ఆర్థిక ఏడాది లక్ష్యం నెరవేరనట్లే అవుతుంది.



పన్ను వసూళ్లలో చతికిలపడ్డ యంత్రాంగం..

ఆస్తిపన్ను వసూళ్లలో మున్సిపాలిటీలలోని రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా సతికలపడింది. పన్ను వసూళ్లకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి, కమిషనర్లు సైతం రంగంలోకి దిగినప్పటికీ ఆశించిన మేరకు వసూలు జరగటం లేదు. ప్రభుత్వ ప్రైవేటు బకాయిలను వసూలు చేసేందుకు ప్రతి ఏడాది మార్చిలో మాత్రమే అధికారులు హడావుడి చేస్తుంటారు. అంతకుముందు కాలంలో వసూళ్లపై దృష్టి కేంద్రీకరణ ఉండదు. నామమాత్రంగానే పని చేస్తుంటారు. మున్సిపాలిటీల్లో పన్ను బకాయిలు పేరుకు పోవడానికి కేవలం ఆయా మున్సిపాలిటీలలోని రెవెన్యూ అధికారుల బాధ్యతా రాహిత్యమే నిదర్శనంగా నిలుస్తోంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న మున్సిపాలిటీల సంఖ్య	:	14
14 మున్సిపాలిటీలలో ఉన్న మొత్తం అసెస్మెంట్ నెంబర్ల సంఖ్య	:	5,37,538.
మున్సిపాలిటీలలో ఉన్న ఆస్తిపన్ను డిమాండ్	:	రూ.506,40,62,131.
ఇప్పటివరకు మున్సిపాలిటీలలో వసూళ్లు చేసిన ఆస్తి పన్ను	:	రూ. 202,40,45,840.
14 మున్సిపాలిటీలలో మిగిలి ఉన్న బ్యాలెన్స్ అమౌంట్ మొత్తం	:	రూ.304,00,16,291

వినుకొండలో అత్యధికంగా వసూళ్లు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 14 మున్సిపాలిటీలలో వినుకొండ మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూళ్లు అత్యధికంగా జరిగాయి. ఆ మున్సిపాలిటీలో మొత్తం 15,730 అసెస్మెంట్ నెంబర్లు ఉండగా, అందులో రూ.6.30 కోట్లు ఆస్తిపన్ను డిమాండ్ ఉంది. దీనిలో రూ.5 కోట్లు వసూలు చేశారు. ఇక కేవలం రూ.1.29 కోట్లు పెండింగ్ ఉంది. చిలకలూరిపేట మున్సిపాలిటీ అత్యల్పంగా పన్ను వసూలు జరిగాయి. మొత్తం అసెస్మెంట్ నెంబర్లు 32,622 కాగా, అందులో ఆస్తిపన్ను డిమాండ్ రూ.22.39 కోట్లు ఉంది. దీనిలో కేవలం రూ.6.40 కోట్లు మాత్రం వసూలు చేశారు. ఇంకా రూ.15.99 కోట్లు బకాయి ఉంది. మిగిలిన 12 మున్సిపాలిటీలలోనూ వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 14 మున్సిపాలిటీలలో ఆస్తిపన్ను వసూలు సగటున 70 శాతం కూడా దాటలేదు. మాచర్ల, నరసరావుపేట మున్సిపాలిటీలలో 42 శాతం, బాపట్లలో 42 శాతం, రేపల్లెలో 56.52 శాతం, పొన్నూరులో 56.93 శాతం, తెనాలిలో 51.53 శాతం, దాచేపల్లిలో 56.53 శాతం, గురజాలలో 55.47 శాతం, పిడుగురాళ్లలో 59.72 శాతం, సత్తెనపల్లిలో 35.19 శాతం మాత్రమే వసూలు అయ్యాయి.

గుంటూరులో కేవలం 33 శాతం మాత్రమే..

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లు అధ్వానంగా ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీలు కార్పొరేషన్ నగరాలుగా ఉన్నాయి. అందులో గుంటూరులో ఇప్పటివరకు కేవలం 33.31 శాతం వసూలు మాత్రమే ఉంది. వాస్తవానికి జీఎంసీ పరిధిలో పెద్ద ఎత్తున రెవెన్యూ సిబ్బంది వివిధ కేటగిరీలలో పనిచేస్తున్నారు. అయినప్పటికీ వసూళ్లు అధ్వానంగా ఉన్నాయి. మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీ పరిధిలో 66.93 వసూళ్లయ్యాయి. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో మాత్రం ఆశించిన మేరకు జరగటం లేదనేది వాస్తవం.



సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాదు, పక్కన ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహమద్, జనసేన, బీజేపీ నేతలు

పట్టభద్రులారా.. ప్రగతికి ఓటెయ్యండి !

● కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): విజ్ఞతతో ఆలోచించి ప్రగతికి ఓటెయ్యాలని పట్టభద్రులకు గుంటూరు-కృష్ణా ఉమ్మడిజిల్లాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు విజ్ఞప్తి చేశారు. గుంటూరు, లక్ష్మీపురంలో ఆయన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుస్థిర పాలనకు మద్దతు ఇవ్వాలని కోరారు. 33 నియోజకవర్గాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నానని, ఆ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రం సంక్షేమ బాట పడుతుందని ఈ సమయంలో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రశ్నించే గొంతుకలు సరైన సమయంలో మూగబోతుంటాయని, నామమాత్రపు ఉద్యమాలతో ఫలితాలేవీ రావని విమర్శించారు. సారవంతమైన భూములు, పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పించే ఈ ప్రాంతాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు. ప్రత్తిపాడు, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహమద్‌లు మాట్లాడుతూ 40ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కల్గిన ఆలపాటిని గెలిపించాలని కోరారు. చంద్రబాబు సమర్థతతో ఎనిమిది నెలల కాలంలోనే ప్రజల తలసరి ఆదాయం పెరిగిందని, ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయన్నారు. రాష్ట్రంలో ప్రగతి సాధించాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ, జనసేన గుంటూరుజిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరపతిరావు, గాదె వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణస్వామి, వేదికపై డాక్టర్ కొల్లి శారద

ఘనంగా శ్రేష్ఠ హాస్పిటల్స్ ప్రథమ వార్షికోత్సవం

● ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు మాజీ మేయర్ డాక్టర్ కొల్లి శారద

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శ్రేష్ఠ హాస్పిటల్స్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం గుంటూరు నగరంలోని హాస్పిటల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో పాటు గత ఏడాదిలో ఆస్పత్రిలో చికిత్సలు పొందిన రోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు నగర మాజీ మేయర్ డాక్టర్ కొల్లి శారద మాట్లాడుతూ అమెరికా, లండన్ వంటి దేశాల్లోని ఆస్పత్రులకు ఏ మాత్రం తీసిపోకుండా శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో ఆధునిక సౌకర్యాలు, అత్యాధునిక చికిత్సలు ఉన్నాయన్నారు. రోగులకు ఉత్తమ వైద్య చికిత్సలు అందిస్తున్నారని వైద్యులను అభినందించారు. శ్రేష్ఠ హాస్పిటలో చికిత్స పొందిన వీ రామ చంద్రరాజు మాట్లాడుతూ ఎంతో క్లిష్ట పరిస్థితుల్లో హెర్నియా ఆపరేషన్ కోసం శ్రేష్ఠ హాస్పిటల్స్‌కు వచ్చానని, ఇక్కడ అధునాతన చికిత్సలతో త్వరగా కోలుకున్నానని, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది ఎంతో ఆప్యాయతగా చూసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే పర్రెపాటి సురేష్, పురుషోత్తం, భాస్కరరావు తదితరులు మాట్లాడతూ వారు ఆస్పత్రిలో పొందిన వైద్యసేవలను వివరిస్తూ వైద్యులను ప్రశంసించారు. కార్యక్రమంలో శ్రేష్ఠ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ వై లక్ష్మణస్వామి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున పాల్గొన్నారు.

రెప్పపాటులో రెండు ప్రాణాలు బలి

● ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన లారీ
● తల్లీ, కూతుళ్ల దుర్మరణం.. ఛిద్రమైన దేహాలు
● గతంలో తండ్రి మృతి.. నేడు అమ్మ, చెల్లి..
● అనాథగా మిగిలిన కుమారుడు

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : లారీ డ్రైవరు నిర్లక్ష్యం రెండు ప్రాణాలను బలి తీసుకుంది. గుంటూరు అమరావతి రోడ్డులోని చిల్లీస్ రెస్టారెంట్ సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురు అక్కడికక్కడే మృతి చెందారు. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నగరంలోని రాజీవ్‌గాంధీనగర్ 6/5కి చెందిన వింజమూరి పుల్లయ్య, నాగమణి(45) దంపతులకు కుమారుడు గోపీచంద్ (24), కుమార్తె చరణ్య(14) సంతానం ఉన్నారు. పుల్లయ్య అనారోగ్యంతో 2014లో మృతిచెందాడు. అప్పటినుంచి నాగమణి టైలరింగ్ చేస్తూ ఇద్దరు పిల్లలను చదివిస్తోంది. గోపీచంద్ బీటెక్ పూర్తిచేసి విజయవాడలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు చరణ్య తొమ్మిదో తరగతి చదువుతోంది. వీరికి అడవి తక్కెళ్ళపాడులో టిడ్కో ఇల్లు ఉంది. గోపీచంద్ 24న రాత్రి విజయవాడలో పని ముగించుకుని అడవి తక్కెళ్ళపాడులోని టిడ్కో నివాసానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం 6 గంటలకు తల్లి నాగమణి, కూతురు చరణ్యలు రాజీవ్‌గాంధీ నగర్‌లోని ఇంటి నుంచి బయలుదేరి గోపీచంద్‌ను కలిసేందుకు స్కూటీపై అడవి తక్కెళ్ళపాడులోని టిడ్కో నివాసానికి వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. అమరావతి రోడ్డు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు రెడ్డిపాలెం వెళ్లే వైపు యూటర్న్ తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా ఆ సమయంలో నగరాలు వైపు నుంచి అమరావతి వైపు అతివేగంగా వచ్చిన లారీ వారి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. నాగమణి, చరణ్యలు రోడ్డుపై పడ్డారు. వారి మీదుగా లారీ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న నల్లపాడుసీఐ వంశీధర్, ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను గుంటూరు జీజీహెచ్‌కి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గతంలో తండ్రి, ఇప్పుడు తల్లి,చెల్లి మృతి చెందటంతో కుమారుడు గోపీచంద్ ఒంటరి వాడయ్యాడు.



అవార్డును అందుకుంటున్న భాష్యం సాకేతరామ్

భాష్యం బ్లూమ్స్‌కు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ 2024-25 అవార్డు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్-ఎంపవరింగ్ ఇండియా 3వ ఎడిషన్ ప్రకటించిన ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున భాష్యంబ్లూమ్స్ పాఠశాల సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డును కైవసం చేసుకున్నట్లు భాష్యం విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తెలిపారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దీపక్ వర్మ పాల్గొని అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు ఉత్తమమైన విద్యనందించేందుకు భాష్యం బ్లూమ్స్ నిర్విరామంగా కృషిచేస్తుందని సాకేత్‌రామ్ అన్నారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ జెడ్‌ఈఓ వరలక్ష్మి, అకడమిక్ కౌన్సిల్ అడ్వైజర్‌రాజా, బ్లూమ్స్ ప్రిన్సిపాల్స్ కవిత, గిరిజారాణిలు పాల్గొన్నారు.

వరుసగా రెండో ఏడాది

3 మిలియన్ టన్నుల సరుకు రవాణ

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వరుసగా రెండో ఏడాది కూడా 3 మిలియన్ టన్నుల సరుకును గుంటూరు రైల్వే డివిజన్ నుంచి రవాణ చేసినట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది ఈ మైలురాయిని మార్చి 2న సాధించగా ఈ సంవత్సరం ఫిబ్రవరి 24వ తేదీకే సాధించామన్నారు. పటిష్ఠమైన ప్రణాళిక, సిబ్బంది అంకిత భావం, టీంవర్కుతోనే ఈ ఘనత సాధ్యమైందన్నారు. కమర్షియల్, ఆపరేటింగ్ విభాగాల అధికారులు ఎం దినేష్‌కుమార్ (సీనియర్ డీవోఎం), సీహెచ్ ప్రదీప్‌కుమార్(సీనియర్ డీసీఎం)లను అభినందించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరికొన్ని విజయాలను డివిజన్ సాధించిందని తెలిపారు. వాటిల్లో గత ఏడాదితో పోలిస్తే డివిజన్‌లో రైళ్లు, గూడ్స్‌ల వేగం 20 శాతం పెరిగిందన్నారు. రోలింగ్ బ్లాక్ కారిడార్ ప్రోగ్రాంలో 95.91 శాతం బ్లాక్‌లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఇప్పటివరకు డివిజన్ మొత్తం 100 లాంగ్ హాల్స్(పొడవాటి గూడ్స్ రైళ్లు) ఏర్పడ్డాయన్నారు. ఈ ఏడాదిలో రైళ్ల సమయపాలన 88.59 శాతంగా నమోదైందన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బొల్లాపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూగచింతలపాలెం గ్రామానికి చెందిన రైతు పీ.నాగేశ్వరరావు(48) విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. నాగేశ్వరరావు పొగాకు చెక్కులను ట్రాక్టర్‌లో లోడు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ బాలకృష్ణ ఘటనా స్థలానికిచేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, అనంతరం పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య, పిల్లలు రోదిస్తున్న తీరు చూపరులను కంట తడి పెట్టించింది.

గుంటూరు, బాపట్ల సర్కిల్స్ ఎస్ఈల నియామకం

● ఈఈలకు ఎస్ఈల ఉద్యోగోన్నతితో ఇన్‌చార్జిల పాలనకు తెర...

గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో గుంటూరు, బాపట్ల సర్కిల్స్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌లుగా కొనసాగుతున్న కేవీఎల్ఎన్ మూర్తి, జి.ఆంజనేయులుతో పాటు ఒంగోలు సర్కిల్‌కు కె.వెంకటేశ్వర్లును పూర్తిస్థాయి ఆపరేషన్ ఎస్ఈలుగా నియమిస్తూ సంస్థ జీఎండీ ఐకేవీ భాస్కర్ మంగళవారం రాత్రి నియామకపు ఉత్తర్వులు విడుదల చేశారు. కేవీఎల్ఎన్ మూర్తిని గుంటూరు సర్కిల్‌కు, జీ ఆంజనేయులని బాపట్ల సర్కిల్‌కు, కె.వెంకటేశ్వర్లును ఒంగోలు సర్కిల్‌కు ఇన్‌చార్జిలుగా ఉన్నారు. ఈనెల 22న ఈఈలకు ఎస్ఈలుగా ఉద్యోగోన్నతి కల్పించటంతో ఆ జాబితాలో ఉన్న కేవీఎల్ఎన్ మూర్తి, ఆంజనేయులు, కె వెంకటేశ్వర్లు ఎస్ఈలుగా నియామకం పొందారు. ఇక ఎస్ఈలుగా ఉద్యోగోన్నతి పొందిన జాబితాలో ఉన్న గుంటూరు టౌన్-2 ఈఈగా వ్యవహరిస్తున్న సీహెచ్ రమేష్, ఎం.శ్రీనివాసరావు (గుంటూరు కన్‌స్ట్రక్షన్స్)ను విజయవాడలోని కార్పొరేట్ కార్యాలయానికి ఎస్ఈలుగా బదిలీ చేశారు. గతంలో గుంటూరు టెక్నికల్ ఈఈగా, ప్రస్తుతం పల్నాడు ఎంఆర్‌టీ సెక్షన్ ఈఈగా వ్యవహరిస్తున్న జె శ్రీనివాసులరెడ్డిని కూడా విజయవాడ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ చేశారు.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు హసిష్



తాడేపల్లిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తైవాన్‌లో చైనీస్ తైపీ రోలర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి 24 నుంచి 30 వరకు జరిగే అంతర్జాతీయ స్కేటింగ్‌పోటీలకు మన దేశం తరపున గుంటూరుజిల్లా తాడేపల్లి డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల హసిష్ ఎంపికయ్యారు. ఫెడరేషన్ అధ్యక్షుడు లీయాహు - త్సాయ్ ఈ మేరకు ఉత్తర్వులు పంపారు. హసిష్ ఆర్టిస్ట్ స్కేటింగ్ విభాగంలో ఫ్రీస్టయిల్ ఇన్‌లైన్, సోలోడాన్స్ పోటీల్లో తలపడతాడు. గత ఏడాది డిసెంబరులో తమిళనాడులోని పొలాచ్చిలో రోలింగ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమస్థానంతో బంగారు పతకం సాధించారు. ఆ అర్హతతోనే తైవాన్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. కోచ్ పి.సత్యనారాయణ, చిట్టిబాబు, ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ కార్యదర్శి పి.థామస్, గుంటూరు రోలర్ స్కేటింగ్ అధ్యక్ష, కార్యదర్శులు సి.నీలిమ, పి.శ్రీకాంత్‌లు హర్షం వ్యక్తం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	78. 85. 95
చికెన్ విత్ స్కిన్	150.00
చికెన్ స్కిన్ లెస్	160.00

1,26,285 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,19,894 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,26,285 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 63,478 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	11500	13000
334	9000	14000	బ్యాడిగి 355	10000	14000
నంబరు. 5	10500	14000	సింజెంటా		
273	10000	13000	బ్యాడిగి 5531	10000	12500
341	10000	14300	ఎస్ఎస్ 250		
4884	9500	13000	బుల్లెట్	--	--
సూపర్ 10	--	--	దేవనూరు డీలక్స్	11500	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఆర్మూరు	10000	11500
తేజ	10000	14200	తాలుకాయలు	5000	7500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

మాచర్ల డిపో నుంచి 58 ప్రత్యేక బస్సు సర్వీసులు

● ఆర్టీసీ డీఎం వీరస్వామి

మాచర్లటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం మాచర్ల డిపో నుంచి వివిధ శైవ క్షేత్రాలకు 58 ప్రత్యేక బస్సు సర్వీసులను ఆర్టీసీ డీఎం బత్తుల వీరస్వామి తెలిపారు. మాచర్ల నుంచి శ్రీశైలానికి 20, రెంటచింతల మండలం సత్రశాలకు 36, మన్నేపల్లికి 2, దైదకు 3, తేరాలకు 1 బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. టిక్కెట్ ధరలో ఎటువంటి పెరుగుదల ఉండదని ఆయన చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

● నేటి నుంచి 144వ సెక్షన్ అమలు

మాచవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎస్ఐ సతీష్ మంగళవారం తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్ పోలింగ్ బూత్ ఏర్పాటు చేయటం జరిగిందని, పోలింగ్ బూత్ పరిసర ప్రాంతాల్లో బుధవారం నుంచి గురువారం ఓటింగ్ పూర్తయ్యే వరకు 144వ సెక్షన్ అమల్లో ఉంటుందని వారు తెలిపారు. పోలింగ్ బూత్ వద్ద తాగునీటి వసతి, వైద్య శిబిరం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారన్నారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ నిర్వహిస్తారన్నారు. ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లు ఓటరు స్లిప్‌తో పాటు ఏవో ఒక గుర్తింపు కార్డు తీసుకొని రావాలని తెలియజేశారు.

విద్యుత్ తీగల వద్ద వ్యర్థాలను కాల్చవద్దు

● ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింగయ్య

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలు, తీగల వద్ద వ్యర్థాలను కాల్చవద్దని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూతలపాటి సింగయ్య కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తీగల వద్ద మంట పెట్టడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. అలాగే రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి 2025-2026 సంవత్సరానికి రాష్ట్రంలో విద్యుత్ రేట్లు నిర్ణయంపై మార్చి 7, 8, 10 తేదీల్లో బహిరంగ విచారణ జరుగుతుందని చెప్పారు. 7, 8 తేదీల్లో విజయవాడ నుంచి, 10వ తేదీన కర్నూల్ నుంచి విచారణ జరుగుతుందన్నారు. మాచర్ల డివిజన్ పరిధిలో అభ్యంతరాలు తెలియజేయదలచిన వారు పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో కాన్ఫరెన్స్‌లో పాల్గొనవచ్చని ఏఈ తెలిపారు.

27 నుంచి మహాలక్ష్మమ్మవారి జాతర

బెల్లంకొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాపాయపాలెంలో గల మహాలక్ష్మమ్మ అమ్మవారి జాతర ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభ మవుతున్నట్టు ఆలయ కమిటీ పెద్దలు పేర్కొన్నారు. 27వ తేదీన సుప్రభాత సేవా కార్యక్రమాలు, సాయంత్రం ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

3వ తేదీ లోపు ఫార్మర్ ఈకేవైసీ చేయించుకోవాలి

నకరికల్లు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఫార్మర్ ఈకేవైసీని మార్చి 3వ తేదీ లోగా పూర్తి చేయించుకోవాలని ఏవో కే దేవదాసు కోరారు. మంగళవారం కుంకలగుంట, జల్లాపేట తండా గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులందరూ రైతు సేవాకేంద్రాల్లో ఫార్మర్ రిజిస్టర్ ఐడీని చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ షేక్ నవాజ్ షరీఫ్, వీహెచ్ఏ వెంకట్, రైతులు పాల్గొన్నారు.

సీసీ నిఘాలో పోలింగ్ కేంద్రాలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గురజాల నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి సీసీ కెమెరాల నిఘాలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేశారు. పిడుగురాళ్ల జడ్పీ పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాల్లో 3786 మంది ఓటర్లు ఉండగా, గురజాల ఎంపీపీ స్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాల్లో 1497 మంది, దాచేపల్లి జడ్పీ పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాల్లో 1637 మంది, మాచవరం జడ్పీ పాఠశాలలో ఒక పోలింగ్ కేంద్రంలో 809 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని గురజాల రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు


సత్తెనపల్లి రూరల్ ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపుతప్పి బోల్తాపడటంతో ఏడుగురు వ్యవసాయ కూలీలకు గాయాలైన సంఘటన మండలంలోని కట్టమూరు వద్ద మంగళవారం ఉదయం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన వ్యవసాయ కూలీలు మిర్చికోతల నిమిత్తం సత్తెనపల్లి మండలం కట్టమూరు వచ్చారు. రోజువారి పనిలో బాగంగా మిర్చి కోసేందుకు ఆటోలో పొలంనకు వెలుతుండగా గ్రామం దాటగానే ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఆ సమయంలో ఆటోలో 20 మంది వరకూ కూలీలు ఉండగా రేణుక, రమ్య, రజిత, వెంకన్న, ఎల్లప్ప, సతీష్‌కుమార్, సాంబయ్యలకు స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్య శాలకు తరలించారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య

దాచేపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం దాచేపల్లిలోని ఎస్సీ కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్సీ కాలనీలో నివాసం ఉండే బండ్ల రూతమ్మ(50) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉంది. ఆమె మానసిక ఒత్తిడికి లోనై ఈ అఘాయిత్యం చేసుకున్నట్టు పోలీసులకు కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ పాపారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్నాడుకే మకుటాయమానం.. సత్రశాల మల్లికార్జునుడు

● నేటి శివరాత్రితో సత్రశాలలో ఆధ్యాత్మిక శోభ
● గుత్తికొండలో మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి


సత్రశాల ఆలయం


సత్తెనపల్లిలోని అచ్చంపేట రోడ్డులో శివాలయం


సత్రశాలలో మల్లికార్జునస్వామి


అమరావతితలో పులివాహనంపై బాలచాముండికా అమ్మవారు

రెంటచింతల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక జ్యోతిర్మండలంగా పేరు గాంచి పల్నాడుకే మకుటాయమానంగా ఉన్న సత్రశాలలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వార్ల కల్యాణం మహాశివరాత్రి రోజైన నేడు జరపడం వందల సంవత్సరాల నుంచి వస్తున్న ఓ ఆచారం సంప్రదాయం. అందులో భాగంగా ఆలయాన్ని సర్వాంగసుందరంగా శోభాయమానంగా తీర్చి దిద్దారు. రాత్రి వేళ స్వామి వార్ల కల్యాణం నిర్వహించడంతో పాటు భక్తుల జాగారానికి గీత ప్రవచనం అలాగే విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు.

పారిశుధ్యం మెరుగ్గా ఉండాలి : ఎమ్మెల్యే

కృష్ణానదిలో స్నానాల ఘాట్ల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సూచించారు. మంగళవారం ఈవో రామిరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ శివయ్యలతో ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

గుత్తికొండ బిళంలో..

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అన్ని శివాలయాల్లో భక్తులకు తగిన సౌకర్యాలు సమకూర్చుతున్నారు. దేవాలయాలన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. గుత్తికొండ బిళంలో శివలింగం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలకు దేవ స్థానం కమిటీ ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని భోళా లింగేశ్వర స్వామి దేవాలయం, నాగులగుడి, శివాలయాలు శివరాత్రికి ముస్తాబయ్యాయి. బుధవారం ఉదయం 5 నుంచి గురువారం 5 గంటల వరకు ఆయా ఆలయాల్లో నిర్విరామంగా పూజలు, భజనలు నిర్వహించనున్నారు.

సత్తెనపల్లిలో ఆలయాల ముస్తాబు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి వేడుకలకు అచ్చంపేట రోడ్డులోని శ్రీదుర్గా అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం (శివాలయం) ముస్తాబైంది. ఆలయానికి సత్తెనపల్లి నుంచే కాకుండా ముప్పాళ్ళ, రాజుపాలెం, క్రోసూరు, అచ్చంపేట మండలాల నుంచి భక్తులు స్వామిని సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు. శివరాత్రి రోజున ఆలయంలో సుహాసినీలతో కుంకుమార్చన జరుగుతుంది. అనంతరం భారీ అన్న సంతర్పణ జరుగుతుంది. అర్ధరాత్రి లింగోద్భవ కాలదర్శనం, స్వామి వారి కల్యాణం జరుగుతుంది.

చేజర్లలో ప్రారంభమైన ఉత్సవాలు

నకరికల్లు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): చేజర్ల కపోతేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు సుప్రభాత సేవ, మేలు కొలుపు నిర్వహించారు. కపోతేశ్వర స్వామి వారిని పెండ్లి కుమారుడిగా, గంగా భ్రమరాంబ పార్వతి అమ్మ వారిని పెండ్లి కుమార్తెగా చేశారు. పూజా కార్యక్రమాలను కొండకావూరి వెంకట్రామయ్య శర్మ, భువనగిరి కపోతేశ్వర శాస్త్రిలు నిర్వహించారు.

ఎన్నికల కోడ్ ముగియగానే డీఎస్సీ నోటిఫికేషన్

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


ఊటుకూరు జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులకు బ్యాలెట్ నమూనా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే సుమారు 16,500 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ వెలువరిస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం ఊటుకూరు జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులను కలుసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల నమూనా బ్యాలెట్ పత్రాలను ఆయన అందజేశారు. జగన్ ప్రభుత్వం ఉపాధ్యాయులను శత్రువులుగా భావించిందని, వారిని ఎన్నో ఇబ్బందులకు గురి చేసిందని, కనీసం జీతాలు కూడా సక్రమంగా ఇవ్వకుండా వేధించిందన్నారు. ఉపాధ్యాయుల బదిలీల కోసం, ప్రమోషన్‌ల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావటానికి యువ నాయకుడు నారా లోకేశ్ ఆధ్వర్యంలో కసరత్తు జరుగుతుందని, ఉపాధ్యాయుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమై ఓటు వేసే విధానాన్ని వివరించారు. ఎన్నికల కో-ఆర్డినేటర్లు ప్రణాళిక ప్రకారం పట్టభద్రులందరితో ఓట్లు వేయించే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే వెంట సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు, టీడీపీ నాయకులు బొల్లేపల్లి రోశయ్య, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కే ప్రకాశరావు, ఇతర ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

అచ్చంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆలపాటిని గెలిపించేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం అచ్చంపేట విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలపై నాయకులకు, కార్యకర్తలకు దిశ, నిర్దేశం చేశారు. ఓటర్ల గృహాలు సందర్శించి ఓటు వేసే విధంగా చైతన్య పరచి ఆలపాటి రాజాకు ఓటు వేసేందుకు నాయకులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఆయనతో పాటు నియోజకవర్గ పరిశీలకులు నల్లపాటి రాము, రాష్ట్ర ఖాదీ గ్రామీణ చైర్మన్ కేకే చౌదరి, మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, కిలారీ రాజన్ బాబు, పాటిబండ్ల బాపిరాజు, వెనిగండ్ల కోటయ్య, నల్లమేకల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించండి

పెదకూరపాడు (ఆంధ్రజ్యోతి): ఆలపాటికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. పెదకూరపాడులోని కాకతీయ హైస్కూల్లో మంగళవారం టీచర్లను కలసి ఆలపాటికి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం, యువత అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నల్లపాటి రాము, కేకే చౌదరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, మాజీ ఎంపీపీ గల్లా బాబూరావు, కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ శీలమనేని ఇందిరాదేవి, కరస్పాండెంట్ లలితబాబు తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని 75 తాళ్ళూరులో వివేకానంద పబ్లిక్ స్కూల్ టీచర్లను తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు కలసి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ఆలపాటికి ఓటు వేయాలని కోరారు.

ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం

● టీడీపీ సీనియర్ నేత యాగంటి


ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న యాగంటి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని టీడీపీ సీనియర్ నేత, మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం మండలంలోని జమ్మలమడక, లింగాపురం గ్రామాల్లో పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్య ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రం అభివృద్ధిపథంలో పయనించాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద రాష్ట్ర మిర్చికి కేంద్రం మద్దతు ధర క్వింటాల్ కు రూ.11,781లు నిర్ణయించిందన్నారు. ప్రతిపక్ష హోదా ఎవరు ఇస్తారో కూడా తెలియని జగన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా అడగడం సిగ్గుచేటన్నారు. పట్టభద్రులకు అండగా ఉండే ఆలపాటిని ఈనెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో గొబ్బూరి కోటయ్య, మున్నా నరసింహారావు, గోవిందయ్య, దుర్గెంపూడి పాపిరెడ్డి, అంజి రెడ్డి, గొబ్బూరి సుబ్బయ్య, తిక్కా కొండలు, బొట్టు కోటేశ్వరరావు, గాజుల అంజనేయులు, దుర్భాకుల ప్రసాద్‌రావు, కోటేశ్వరరావు, సత్యం, కురకుల శ్రీను, వీర్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి మండలంలో..

కారంపూడి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం కూటమి నేతలు కారంపూడి పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్య ఓటును అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొంగర లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ దోర్నాల నాగిరెడ్డి, మాజీ ఉప ఎంపీపీ కర్ల అమర సైదారావు, ఉన్నం లక్ష్మీనారాయణ, వడ్లమూడి హనుమంతురావు, బీజేపీ నేత శెట్టి హనుమంతురావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, పట్టణ అధ్యక్షుడు తెలగనేని లక్ష్మయ్య, తోట రంగారావు, లింగాల శ్రీనివాసరావు, కజ్జం ఆంజనేయులు, పువ్వాడ శ్రీనివాసరావు, చలవాది సాయి, అదెల సాయి, కిల్లా పెద కోటేశ్వరరావు, అంకిరాజు, నాని, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతలలో..

రెంటచింతల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆలపాటి గెలుపు కోసం టీడీపీ మండల నేతలు మంగళవారం రెంటచింతల టౌన్‌లో ఓటర్లకు కరపత్రాలను పంచి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, మాజీ డీసీ చైర్మన్ నల్లబిరుదు నరశింహారావు తదితరులున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి లక్ష్మణరావును గెలిపించాలి

● సీఐటీయూ నేత ఆంజనేయులు

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని సీఐటీయూ నేత ఆంజనేయులు నాయక్ కోరారు. మంగళవారం పట్టణంలో లక్ష్మణరావు గెలుపును కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు వేముల వెంకట్రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై తహసీల్దార్ సమావేశం

మాచర్లటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై మంగళవారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన సెక్టార్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీఎస్‌టీ, ఎంసీసీ, ఎస్ఎస్‌టీ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఎంపీడీవో ఫణికుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి : ఎస్ఐ

దుర్గి, వెల్దుర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఈనెల 27వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని దుర్గి, వెల్దుర్తి ఎస్ఐలు సుధీర్‌కుమార్, సమందర్‌వలిలు కోరారు. ఈనెల 26, 27 తేదీల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కారంపూడి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నయోమి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మార్చి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలి : ఏవో

పెదకూరపాడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని ఏవో శాంతి అన్నారు. మండలంలోని కంభంపాడు, 75 తాళ్ళూరు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కోటప్పకొండలో పోలీస్ సిబ్బందికి భోజన సదుపాయం

● స్వయంగా వడ్డించిన తులసీ రామచంద్రప్రభు


పోలీసు సిబ్బందికి వడ్డిస్తున్న తులసీ రామచంద్రప్రభు

గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రికి ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో జాతర బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి తులసీ సీడ్స్ ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు. కోటప్పకొండలో సేవాశిబిరం క్యాంపునకు విచ్చేసిన 300 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ సిబ్బందికి, 3వేల మంది పోలీసు సిబ్బందికి తులసీ సీడ్స్ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు అల్పాహారం, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం తులసీ రామచంద్రప్రభు లాంఛనంగా భోజన సదుపాయాలను స్వయంగా వడ్డించి ప్రారంభించారు. రామచంద్రప్రభు మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చేసే సేవా కార్యక్రమాలు వారిలో దేశభక్తిని, సేవా తత్పరతను పెంపొందిస్తాయన్నారు. దేశాభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. 14 సంవత్సరాలుగా, భక్తుల సేవ, సహాయ కార్యక్రమాల కోసం కోటప్పకొండ తిరునాళ్ళకు విచ్చేస్తున్న పోలీస్ సిబ్బందికి తులసి సీడ్స్ సంస్థ మూడు రోజుల పాటు భోజన సదుపాయాలను అందజేస్తుందని, అదేవిధంగా ఈ సంవత్సరం కూడా ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. తులసి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ యోగిష్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థులందరూ లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని పట్టుదలతో వాటిని సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎండీ యోగిష్ చంద్ర మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో క్యాంపు కన్వీనర్ రాంబాబు, క్యాంపు ఆఫీసరు శ్రీనివాసరావు, క్యాంపు సహాయకులు వివి హరనాథ్, షేక్ దావూద్, ఎస్ అంజిరెడ్డి, విద్యార్థులు, తులసి సీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు వినియోగించుకోండి

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పట్టభద్రుల ఓటరు ఓటు వేయాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎన్నికలకు ఒక్కరోజే సమయం ఉండటంతో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అత్యధిక మెజారిటీతో గెలుపొందేలా ప్రతిఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలని యరపతినేని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని యరపతినేని తెలియజేశారు.

కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

● నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాశ్ నారాయణ


ఓటర్‌కు కరపత్రాన్ని అందిస్తున్న తాతా జయప్రకాశ్ నారాయణ

ముప్పాళ్ళ ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు తాతా జయప్రకాశ్ నారాయణ అన్నారు. ముప్పాళ్ళ మండలంలో మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముప్పాళ్ళ, మాదల బీసీ గురుకుల పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో జీతం ఎప్పుడు వస్తుందో తెలియక ఉద్యోగులు సతమతమయ్యారని అన్నారు. త్వరలోనే మెగా డీఎస్సీ ప్రటిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నిరుద్యోలకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు శిరిగిరి పవన్, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు రావిపాటి నానయ్య, మాజీ ఉపఎంపీపీ రావిపాటి మధుబాబు, నాయకులు అబ్దుల్ మజీద్, తురకపాలెం సర్పంచ్ మల్లవరపు చంద్రశేఖర్ తదితరులున్నారు.

వడ్డవల్లిలో ఎమ్మెల్యే కన్నా ప్రత్యేక పూజలు


ప్రభ వద్ద పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లకు పట్టణంలోని వడ్డవల్లి ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి, పోలేరమ్మ గుడి నుంచి వెళ్లే రెండు ప్రభల వద్ద మంగళవారం రాత్రి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ప్రభల నిర్వాహకులు ఎమ్మెల్యే కన్నాను ఘనంగా సన్మానించారు. పోలేరమ్మ గుడిలో కూడా కన్నా ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, ప్రకాష్, వడ్డవల్లి వలి, సత్యనారాయణ, సైదులు, పూజల వెంకట కోటయ్య, జానీ ఖాజావలి, వీరభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు

సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం రాత్రి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు నంబూరికి లేదు

● మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య

క్రోసూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వాన్ని గానీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును గానీ విమర్శించే హక్కు, అర్హత మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు లేదని మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాంద్రు కాశయ్య అన్నారు. నంబూరు శంకరరావు కూటమి ప్రభుత్వంపై చేసిన విమర్శలను ఆయన ఖండించారు. సూపర్ - 6 పథకాలను ఎనిమిది నెలల కాలంలో ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమల్లోకి తెస్తుందని, రైతుల ప్రయోజనాలు కాపాడటానికి ముఖ్యమంత్రి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. గత ఏడాది డిసెంబరులోను, ఈ నెలలోను కేంద్రానికి రాసిన లేఖల వల్లనే మిర్చి రైతులను ఆదుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మిర్చి క్వింటాల్ రూ.11,781 చెల్లించేందుకు కేంద్రం అంగీకరించటం చంద్రబాబు కృషి ఫలితమేనన్నారు. ఇప్పటికైనా నంబూరు శంకరరావు ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలని, లేకపోతే కూటమి కార్యకర్తలు తగిన విధంగా స్పందించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు దుడ్డుల యోహాన్, పార్టీ నాయకులు మన్నెం శివయ్య, జుజ్జూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో క్రోసూరు విద్యార్థిని ప్రతిభ

క్రోసూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పాత తాలూకా స్థాయిలో సత్తెనపల్లిలోని ఎస్‌బీజీ కళాశాలలో జరిగిన టాలెంట్ టెస్ట్‌లో క్రోసూరు విద్యార్థిని గుగ్గిలం విద్యాసిరి ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానంలో నిలిచినట్టు జై భారత్ విద్యా సంస్థల డైరెక్టర్ టీ జయనేంద్రారెడ్డి తెలియజేశారు. విద్యార్థిని తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నట్టు ఆయన తెలిపారు. మరొక విద్యార్థిని బొల్లా భవిత కన్సోలేషన్ బహుమతి సాధించిందన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులకు బహుమతులు రావటం హర్షణీయమన్నారు.



● నేడే మహా శివరాత్రి తిరునాళ్ల

● విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా కోటప్పకొండ

● అమరావతి, కాకాని, గోవాడ, క్వారీ సహా శైవక్షేత్రాల్లో ఏర్పాట్లు

విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్న కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధి

శివపూజకు.. వేళాయే

అమరావతిలో ప్రత్యేక ఏర్పాట్లు

అమరావతి: బుధవారం మహాశివరాత్రి పర్వది నానికి అమరేశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు స్నానఘాట్ వద్ద జల్లు స్నానానికి ఏర్పాట్లు చేశారు. స్త్రీలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేశారు. క్యూల్లో ఉండే భక్తులకోసం



షామియానాలు, తాగునీటి తదితర ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఉచిత ప్రసా దాలు, పాలు, అన్నదానం చేసేందుకు పలువురు దాతలు సిద్ధమయ్యారు. స్వామివారి కల్యాణానికి మండపాన్ని సిద్ధం చేశారు. బందోబస్తు పోలీసులు మంగళవారం సాయంత్రానికి అమరావతి చేరుకున్నారు. మంగళవారం బాలచాముండిక అమ్మవారు పులి వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం పల్లకిలో బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వార్లను ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో సునీల్‌కుమార్ వేదపండితులు, అర్చకులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముస్తాబైన మల్లన్న సన్నిధి

పెదకాకాని: మహాశివరాత్రికి పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలుగొందుతుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయంలో ప్రత్యేక



క్యూలను ఏర్పాటు చేశారు. దేవస్థానం తరఫున, వివిధ సంఘాలు, సంస్థల సభ్యులు ప్రత్యేకంగా భక్తులకు సేవలు అందించేందుకు ముందుకు వచ్చారు. ఆలయంలో భక్తులకు ఉచిత ప్రసాదాలు, భోజన సదుపాయాలను కల్పిస్తున్నారు. బుధవారం రాత్రి 11 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రెండు గంటలకు స్వామివారి గ్రామోత్సవం, ఆ తర్వాత శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఈవో,ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు.

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల బుధవారం నేత్రపర్వంగా జరగనుంది. భక్తుల కోసం కోటప్పకొండలో సర్వం సిద్ధం చేశారు. విద్యుత్ దీపాల అలంకరణలతో కోటప్పకొండ దేదీప్యమానంగా వెలుగొందుతోంది. కొండ ఎగువన, దిగువన విద్యుత్ దీపాలను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. త్రికోటేశ్వరస్వామి సన్నిధి తిరునాళ్లకు ముస్తాబైంది. అర్ధరాత్రి స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగనున్నాయి. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాతో ప్రభుత్వం తరఫున కోటయ్యస్వామికి బుధవారం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అభిషేక మండపం లో ప్రత్యేక అభిషేకాల కోసం ఏర్పాట్లు చేశారు. చిలకలూరిపేట మేజర్ కాల్వ వద్ద భక్తుల కోసం స్నానఘట్టాలను ఏర్పాటు చేశారు. భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కొండ దిగువన ప్రత్యేక షెడ్ ఏర్పాటు చేశారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో చంద్రశేఖరరావు, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షిస్తున్నారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేసేందుకు దేవస్థానం, సేవా సంస్థల ఆధ్వర్యంలో భారీగా సిద్ధం చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, సత్యసాయి సేవా సమితి సభ్యులు సేవలు అందించేందుకు కొండకు తరలి వచ్చారు.

కోటప్పకొండకు 550 బస్సు సర్వీసులు

కోటప్పకొండకు ఆర్టీసీ 550 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, అద్దంకి, చీరాల, ఒంగోలు బస్టాండ్‌ల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. వీఐపీల కోసం 20 ఆర్టీసీ వాహనాలను ఏర్పాటు చేశారు. ఘాట్ రోడ్డులో 85 బస్సులు నిర్వహించనున్నారు. కొండ వద్ద చిలకలూరిపేట రోడ్డులో, ఘాట్ రోడ్డు పక్కన, కొండపైన ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్లను నిర్వహిస్తున్నది.

అన్నదానాలకు భారీగా ఏర్పాట్లు

కొండ దిగువన ఉన్న వివిధ సామాజిక సత్రాలలో లక్షల మందికి అన్నదానం జరగనుంది. మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా అన్నదానం చేసేందుకు సత్రాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవస్థానం వద్ద, కొండ దిగువ ప్రాంతాలలో తొమ్మిది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కొండలోని పీహెచ్‌సీలో ప్రత్యేకంగా పడకలు ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ శాఖ కొండ ప్రాంతంలో మద్య నిషేధం విధించింది. పది కిలో మీటర్ల వరకు మద్యం విక్రయాలను నిలిపి వేశారు.

2,500 మంది పోలీసులతో బందోబస్తు

తిరునాళ్లకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో 2,500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. బందోబస్తు పర్యవేక్షణకు కొండ ఎగువన, దిగువన కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. సీసీ కెమేరాల ద్వారా బందోబస్తును పర్యవేక్షిస్తారు. డ్రోన్‌లను కూడా వినియోగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచే పోలీసులకు విధులు కేటాయించారు. కొండ ప్రాంతం వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేట, పెట్లూరివారిపాలెం రహదారుల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా వన్‌వే నిర్వహిస్తారు. కొండ ఎగువన, దిగువన తాత్కాలిక రూరల్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం ఎస్పీ పర్యవేక్షించారు. తిరునాళ్ల ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



కోటప్పకొండకు ప్రభతో తరలివస్తున్న చిన్నారులు



కోటప్పకొండకు తరలివస్తున్న అవిశాయపాలెం భారీ విద్యుత్ ప్రభ

19 భారీ విద్యుత్ ప్రభలు

కోటప్పకొండ తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి 19 భారీ విద్యుత్ ప్రభలు తరలివస్తున్నాయి. వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రభలు మంగళవారం కొండకు పయనమయ్యాయి. ప్రభల రాక నేపథ్యంలో చిలకలూరిపేట రోడ్డులోని ప్రధాన విద్యుత్ లైన్‌కు బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఒక్కొక్క ప్రభ 90 అడుగులకు పైగా ఎత్తులో నిర్మించారు. నాదెండ్ల మండలం అవిశాయపాలెం, అప్పాపురం గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలివస్తున్నాయి. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, గోవిందాపురం, కోమటినేని వారిపాలెం, కావూరు నుంచి ఒక్కొక్కటి, చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నం నుంచి ఆరు, బొప్పూడి నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు వస్తున్నాయి. నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, గురవాయపాలెం నుంచి ఒక్కొక్కటి, కాకాని గ్రామం నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలి వస్తున్నాయి. నరసరావుపేట పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సాధారణ ప్రభలు కొండకు తరలివస్తున్నాయి.

వీఐపీలకు పెద్దపీట

కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీలకు పెద్ద పీట వేస్తున్నారు. వీరి సేవలో అధికారులు తరించనున్నారు. సామాన్య భక్తులకు అటు ఆర్టీసీ, ఇటు దేవస్థానం అన్ని సేవలకు టిక్కెట్లను విక్రయిస్తున్నది. అయితే కొండ కింద కారు దిగిన దగ్గర నుంచి స్వామి దర్శనం చేసుకునే వరకు వీఐపీలకు అన్ని సేవలను ఉచితంగా అందించేందుకు అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. వేలాదిగా దర్శనం పాసులను పంపిణీ చేశారు. వీఐపీలకు ఉచితంగా 20 బస్సులను ఏర్పాటు చేసిన ఆర్టీసీ సామాన్య భక్తుల నుంచి అధిక చార్జీలను వసూలు చేస్తున్నది.



స్నాన ఘట్టం వద్ద భారీ శివ కుటుంబం విగ్రహం



శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు



శ్రీ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, చదలవాడ అరవిందబాబు, యరపతినేని నిఖిల్

ఉత్సవాలకు.. క్వారీ సిద్ధం

పొన్నూరుటౌన్(చేబ్రోలు): ప్రముఖ శైవక్షేత్రమైన వడ్లమూడి క్వారీ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు దేవదాయశాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గతంలో ఉన్న టిక్కెట్లు వ్యవస్థను రద్దుచేశారు. ఇప్పటికే రెండురోజులుగా ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం భక్తులు పెద్దసంఖ్యలో స్వామి దర్శనానికి పోటెత్తారు. ట్రాఫిక్ మళ్లించి రద్దీ నియంత్రణకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసిన్హా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఏడు భారీ విద్యుత్ ప్రభలు ఆలయానికి చేరుకుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో ప్రభ ఎత్తు 50 అడుగుల పైగానే నిర్మించారు. పారిశుధ్య పనులకు పొన్నూరు, చేబ్రోలు, తెనాలి ప్రాంతాల్లోని పారిశుధ్య కార్మికులకు విధులు కేటాయించారు.



నారాకోడూరు గ్రామంలో రూపుదిద్దుకున్న భారీ విద్యుత్ ప్రభ



గోవాడలో విస్తృత ఏర్పాట్లు

అమృతలూరు: మహాశివరాత్రి ఉత్సవాలకు గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని, భక్తుల దర్శనానికి సిద్ధం చేశారు. మంగళవారం రైతులు పశు సంపదను తోలుకు వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. స్వామి వారికి వెన్న తదితర మొక్కుబడులను చెల్లించారు. ఇక్కడ శివరాత్రి ఉత్సవాలు ఐదు రోజులు జరుగుతాయి. బాలలకు వినోదం అందించేందుకు జెయింట్ వీల్, తదితర వినోద సాధనాలు ఏర్పరిచారు. తెనాలి, బాపట్ల, రేపల్లె నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. కాకతీయ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, పద్మశాలీయ, శాలివాహన అన్నదాన సత్రాల్లో భక్తులకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పట్టభద్రుల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు

గుంటూరు ఏసీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బుధవారం రూట్ల వారీగా పోలింగ్ సామగ్రిని సిబ్బందికి కేటాయించి బస్సులు/వాహనాల్లో తరలిస్తామని రిటర్నింగ్ అధికారి,గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. పల్నాడు జిల్లాకు సంబంధించి ఎస్ఎస్ఎన్ కాలేజీ నరసరావుపేట, బాపట్ల జిల్లాకు సంబంధించి రేపల్లెలోని ఏవీఆర్ డిగ్రీ కళాశాల, బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో, కృష్ణా జిల్లాలో గుడివాడ ఆర్డీవో ఆఫీసు, ఉయ్యూరు ఆర్డీవో ఆఫీసు, నోబెల్‌కాలేజీ, ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి విజయ వాడ సబ్ కలెక్టర్ ఆఫీసు, నందిగామ ఆర్డీవో ఆఫీసు, తిరువూరు జడ్పీ బాలికల పాఠశాల, ఏలూరు జిల్లాకు సంబంధించి నూజివీడు సబ్ కలెక్టర్ ఆఫీసు, ఏలూరు గిరిజన భవన్‌లో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ జరుగుతుందన్నారు.

లక్ష్మణరావు ఫిర్యాదుని ఎస్పీలకు పంపించాం

తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులలో ఒకరైన సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఫిర్యాదు చేశారని కలెక్టర్ తెలిపారు. ఆ ఫిర్యాదుని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆరు జిల్లాల ఎస్పీలకు పంపించామని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి పాల్గొన్నారు.

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి,గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్య పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసిందన్నారు. 48 గంటల పాటు మద్యం దుకాణాలకు కూడా సీలు వేస్తామన్నారు. ఓటర్లు కచ్చితంగా ఎన్నికల సంఘం నిర్దేశించిన 10 ఐడీ కార్డులలో ఏదో ఒకటి తప్పక తీసుకుని పోలింగ్ బూత్‌కు వెళ్లాలన్నారు. ఐడీ కార్డుతో పాటు స్లిప్పు కూడా వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఓటర్ల సహాయం కోసం కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గుంటూరులో కంట్రోల్ రూంని ఏర్పాటు చేసి నంబరు.0863-2241029 నంబరుని ఓటర్లకు అందుబాటులో ఉంచుతామన్నారు. 3 లక్షల 47 వేల 116 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించు కునేలా స్వీప్ కార్యక్రమాల ద్వారా ప్రతీ మండలంలో అవగాహన కల్పించామన్నారు.

ఓటుపై అవగాహన అవసరం

ఓటు వేసే విధానంపై ఓటర్లు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ అభ్యర్థికి అయితే తొలి ప్రాధాన్య ఓటు వేయదలిచారో ఆ అభ్యర్థి పేరు పక్కన ఉన్న గడిలో 1 అని అంకె వేయాలన్నారు. ఆ తర్వాత 2, 3, 4... ఇలా 25 మంది అభ్యర్థులకు ప్రాధాన్య ఓట్లు అంకెల రూపంలో వేయవచ్చన్నారు. పోలింగ్ బూత్‌లో ఇచ్చే వంకాయ రంగు పెన్నుతోనే ప్రాధాన్య ఓటు అంకెని నమోదు చేయాల న్నారు. పోస్టల్ బ్యాలెట్లు తీసుకున్న ఉద్యోగులు మాత్రం ఏ పెన్నుతోనైనా అంకె నమోదు చేయవచ్చన్నారు. ఉద్యోగులు ఓటు వేసేందు కోసం గురువారం స్పెషల్ క్యాజువల్ లీవ్‌ని ఎన్నికల సంఘం ప్రకటించిందని, దరఖాస్తు చేసుకుంటే తప్పక దానిని ఆమోదించాలని అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలను ఆదేశించారు. ఆరు జిల్లాల పరిధిలో ఈ నియోజకవర్గానికి సంబంధించి 483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 140 పీఎస్‌లు క్లిష్టమైనవిగా గుర్తించి అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫి, మైక్రో అబ్జర్వర్‌ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

❖ క్లిష్టమైన బూత్‌ల వద్ద అదనపు బందోబస్తు ❖ ప్రతీ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, వెలుపల వీడియోగ్రఫీ

❖ 0863-2241029 నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు

❖ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి



ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న పరిశీలకురాలు వీ కరుణ

ప్రశాంత పోలింగ్ నిర్వహించాలి

కలెక్టర్లు, ఎస్పీలకు ఎన్నికల పరిశీలకురాలి ఆదేశాలు

పట్టభద్రుల ఎన్నికల ఓటింగ్ పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని జనరల్ అబ్జర్వర్ వీ కరుణ ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆమె ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజతో కలిసి ఎన్నికల ఓటింగ్‌పై ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ కరుణ మాట్లాడుతూ ఓటింగ్ సక్రమంగా జరిగేలా కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో కేంద్రాల్లో ఓటింగ్‌కు చర్యలు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్లు వరకు 144 సెక్షన్‌ను విధించాలన్నారు. ఓటు వేయడానికి వచ్చే వీఐపీలకు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ పోలింగ్ మెటీరియల్ తరలింపునకు రూట్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. కృష్ణా, బాపట్ల, పల్నాడు, ఏలూరు జిల్లాల కలెక్టర్లు బాలాజీ, మురళి, అరుణ్‌బాబు, వెట్రిసెల్వి మాట్లాడుతూ బ్యాలెట్ పేపరు, ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాల వారీగా వేరు చేశామన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, ఏలూరు, కృష్ణా, బాపట్ల జిల్లాల ఎస్పీలు ప్రతాప్‌శివకిశోర్, గంగాధర్‌రావు, తుషార్‌డూడీ మాట్లాడుతూ క్రిటికల్ పోలింగ్‌స్టేషన్ల వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

కోటప్పకొండకు వినుకొండ మునిసిపల్ కార్మికులు

వినుకొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో ప్రత్యేక పారిశుధ్య పనులను వినుకొండ మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ పర్యవేక్షణలో చేపడుతున్నట్లు మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కోటప్పకొండలో జరుగుతున్న తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నుంచి గురువారం వరకు వినుకొండకు చెందిన మునిసిపల్ పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మద్యం దుకాణాల మూసివేత

వినుకొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వినుకొండ నియోజకవర్గంలో మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి ఈ నెల 27వ తేదీ సాయంత్రం 4గంటల వరకు వైన్‌షాపులు, రెస్టారెంట్‌లు మూసివేయనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు.

ప్రత్యేక శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని జీవీకి వినతి

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మాలలకు ప్రత్యేక శ్మశాన వాటికతో పాటు వారి అభివృద్ధికి కృషిచేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును గుంటూరులోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వినుకొండ పట్టణంలో సుమారు 500కుటుంబాలకు పైగా మాలలు ఉన్నప్పటికీ ఇంతవరకు శ్మశానం లేక ఇబ్బంది పడుతున్నారని, అదేవిధంగా పట్టణంలో శుభకార్యాలు నిర్వహించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం ఏర్పాటు చేయాలని, బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధిలోని హైకోర్టులో వాజ్యం నడుస్తున్న జాలలపాలెం పంచాయతీలోని 175ఎకరాల భూములు, నూజెండ్ల మండలం దాట్లవారిపాలెం గ్రామంలోని భూ సమస్యలను పరిష్కరించి పేదలకు పంపిణీ కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిపూడి ఏసురత్నం, నియోజకవర్గ అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, పమిడిపల్లి ఇశ్రాయేలు, పట్టణ అధ్యక్షుడు రాయని చిన్న తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన శివమాలధారి మృతదేహం లభ్యం


దాసరి మోహన్‌రావు (ఫైల్ ఫొటో)

గంటవారిపాలెం (శావల్యాపురం) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో స్నానం చేసేందుకు దిగి నీటి ప్రవాహంలో సోమవారం గల్లంతైన శ్రీకాకుళం జిల్లా, కవిటి మండలం, దాసరిపుట్టుక గ్రామానికి చెందిన శివమాలధారి దాసరి మోహన్‌రావు (45) మృతదేహం కెనాల్ మార్గంలోని అడవిపాలెం పవర్‌ప్లాంట్ సమీపంలో మంగళవారం లభ్యమైనట్లు ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. బంధువు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాల బాలికలకు ప్రత్యేక క్లినిక్

రొంపిచర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కౌమార బాల బాలికలకు ప్రత్యేక క్లినిక్ నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి జగన్ నరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకు వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. రక్తహీనత తదితర అంశాలపై సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. బాల బాలికలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్సిల్స్ కార్యాలయాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పార్సిల్స్ కార్యాలయాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పార్శిల్ కార్యాలయానికి ఎటువంటి సరుకులు, వస్తువులు వస్తున్నాయి.. ఎక్కడికి వెళ్తున్నాయి.. అన్న దానిపై ఆరాతీశారు. వచ్చిన ప్రతి దానికి బిల్లు ఉందా లేదా అన్న విషయాన్ని తనిఖీ చేశారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు విజిలెన్స్ సీఐ పి శివాజీ తెలిపారు. అనుమానాస్పద వస్తువులు, సరుకులు, బిల్లులు లేకుండా సరఫరా అయ్యేవి ఏమైనా ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నేడు మన్నెపల్లి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ళ

బొల్లాపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులాపురం శివారు మన్నెపల్లి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ళ బుధవారం ఘనంగా జరగనున్నాయి. రాష్ట్రం మొత్తం శివనామ స్మరణతో మారు మ్రోగుతుండగా మన్నెపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో వెంకటేశ్వరస్వామి కల్యాణం చేయటం విశేషం. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు రెండు మూడు జిల్లాల నుంచి ప్రజలు భారీగా తరలిరానుండటంతో దేవదాయ శాఖ, పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు సంజీవకొండ తిరునాళ్ళ

ఈపూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని సంజీవకొండ పైన ఉన్న సంజీవమహేశ్వరస్వామి తిరునాళ్ళను జరుగునుంది. తిరునాళ్ళ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తారు.

కోటప్పకొండకు తరలిన విద్యుత్ ప్రభలు


కొండకు తరలివెళ్తున్న అమీన్‌సాహెబ్‌పాలెం విద్యుత్ ప్రభ, కోటప్పకొండకు వెళ్లే దారిలో ఆరా మస్తాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న అన్నదానం

నాదెండ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకొని కోటప్పకొండలో జరిగే తిరునాళ్ళకు మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామాలకు చెందిన భారీ విద్యుత్ ప్రభలు మంగళవారం మధ్యాహ్నం నుంచి తరలివెళ్ళాయి. ఊరంతా ఒక్కటై ప్రభ వెంట పొలిమేర వరకు కులాలు, మతాలకు అతీతంగా గ్రామస్థులు వెంట నడిచారు. ఆయా గ్రామాల్లో ప్రభలకు మహిళలు వార్లు పోసి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. పంబతాళ్ళను చేతబూని చేదుకో కోటయ్య అంటూ నినాదాలు చేస్తూ యువకులు తరలివెళ్ళారు. బుధవారం కోటప్పకొండలో జరిగే తిరునాళ్ళకు తరలి వచ్చే లక్షలాది మందికి ఈ ప్రభలు కనువిందు చేయనున్నాయి.

ఘనంగా ఈశ్వర్ కళాశాలలో...

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో మహాశివరాత్రి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు భక్తి శ్రద్ధలతో సాంస్కృతిక కార్యక్రమాలు, శివుని భక్తి పాటలుతో పాటు శివుని వేషధారణలో ప్రదర్శనలు ప్రత్యేక అకర్షణగా నిలిచారు, వివా మొబైల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలలో గుంటూరు బ్రాంచి మేనేజర్ డీవీ గోపికృష్ణ, డిస్ట్రిబ్యూటర్ రామకృష్ణ, ఏరియా సేల్స్ మేనేజర్ షేక్ రఫీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, చైర్మన్ షేక్ మీరావలి, విద్యార్థులు పాల్గొన్నారు.

శివరాత్రి పర్వదినానికి ఆలయాల్లో ఏర్పాట్లు

రొంపిచర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజోతి): మండలంలోని గ్రామాల్లోని శివాలయాల్లో శివరాత్రి పర్వదినం సందర్భంగా ఏర్పాట్లు మంగళవారం ఏర్పాటు చేశారు. రొంపిచర్లలోని శంకర స్వామి, విప్పర్లలోని వల్లభేశ్వర స్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీల కంఠేశ్వర స్వామి, గోగులపాడులోని చంద్రమౌళీశ్వర స్వామి, మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లోని రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో కమిటీలు ఏర్పాట్లు చేశారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

ఆరా ఫౌండేషన్ సేవలు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్ళకు వెళ్లి వచ్చే వేలాదిమంది భక్తులకోసం ఆరా ఫౌండేషన్ చైర్మన్ ఆరా మస్తాన్ ఆధ్వర్యంలో భారీఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం ప్రారంభమైన ఈ కార్యక్రమం గురువారం వరకు కొనసాగుతోంది. తొలిరోజున చిలకలూరిపేట కోటప్పకొండ మార్గంలో 20 మొబైల్ వాహనాల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధ, గురు వారాలలో పట్టణంలోని పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్, మద్దిరాలలోని ఆరా మస్తాన్ గృహం వద్ద, కోటప్పకొండ దిగువన ఏర్పాటుచేసిన శిబిరం వద్ద అన్నదానం ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజు 10 నుంచి 12 వేల మంది భక్తులకు, మొత్తం మూడు రోజులలో 30 నుంచి 40వేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులతో పాటు ప్రభల నిర్వాహకులు, ప్రభుత్వ శాఖల సిబ్బంది, చిరు వ్యాపారులకు అన్నప్రసాద వితరణ ఏర్పాట్లు చేశారు.

ప్రభల తరలింపును ప్రారంభించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని పురుషోత్తమపట్నంలో కోటప్పకొండకు ప్రభలను తరలించే కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్తిపాటి ట్రాక్టర్ ఎక్కి ప్రభ వాహనాన్ని ముందుకు నడిపించారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ నియోజకవర్గప్రజలకు, కూటమి పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, టీడీపీ అభిమానులకు శివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తిరునాళ్లకు వచ్చే వేలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనసేన నేత తోట రాజా రమేష్, పోలంరెడ్డి దినేష్ రెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అలాగే ఈ ప్రభల తరలింపు కార్యక్రమంలో మాజీ మంత్రి విడదల రజని కూడా పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి తులసీ సీడ్స్ సేవలు

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రికి ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో జాతర బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి తులసీ సీడ్స్ ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు. కోటప్పకొండలో సేవా శిబిరం క్యాంపునకు విచ్చేసిన 300 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ సిబ్బందికి, 3వేల మంది పోలీసు సిబ్బందికి తులసీ సీడ్స్ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు అల్పాహారం, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం తులసీ రామచంద్రప్రభు లాంఛనంగా భోజన సదుపాయాలను స్వయంగా వడ్డించి ప్రారంభించారు. రామచంద్రప్రభు మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా, భక్తుల సేవ, సహాయ కార్యక్రమాల కోసం కోటప్పకొండ తిరునాళ్ళకు విచ్చేస్తున్న పోలీస్ సిబ్బందికి తులసి సీడ్స్ సంస్థ మూడు రోజుల పాటు భోజన సదుపాయాలను అందజేస్తోందన్నారు. తులసి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ యోగీష్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థులందరూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎండీ యోగిష్ చంద్ర మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో క్యాంపు కన్వీనర్ రాంబాబు, క్యాంపు ఆఫీసరు టి శ్రీనివాసరావు, క్యాంపు సహాయకులు వివి హరనాథ్, షేక్ దావూద్, ఎస్ అంజిరెడ్డి, విద్యార్థులు, తులసి సీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసు సిబ్బందికి అన్నప్రసాద వితరణ చేస్తున్న తులసీ రామచంద్రప్రభు

500 మంది పోలీసులతో బందోబస్తు


చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా చిలకలూరిపేట ప్రాంతంలో సుమారు 500మంది పోలీసులతో భారీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు మంగళవారం తెలిపారు. ఇద్దరు డిఎస్పీలు, 9 మంది సీఐలు, 18మంది ఎస్ఐలు విధులలో ఉంటారని పేర్కొన్నారు. కోటప్పకొండకు వెళ్లటానికి, తిరిగి చిలకలూరిపేటకు చేరుకోవడానికి వన్‌వే విధానాన్ని అమలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. చిలకలూరిపేట వైపు నుంచి ఆర్టీసీ బస్సులలో వెళ్లే భక్తులు పురుషోత్తపట్నం, యడవల్లి, యూటీ జంక్షన్ మీదుగా కోటప్పకొండ ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాలన్నారు. వీఐపీలు యూటీ వద్ద ఏర్పాటుచేసిన పార్కింగ్‌లో వాహనాలు నిలుపుకోవాలని సూచించారు. చిలకలూరిపేట నుంచి వచ్చే ట్రాక్టర్లు, ఇతర వాహనాలు పురుషోత్తపట్నం, యడవల్లి, అట్టల ఫ్యాక్టరీ రోడ్డు నుంచి కట్టుబడివారిపాలెం మీదుగా ప్రభల స్టాండ్ వద్దకు చేరుకోవాలన్నారు. తిరుగు ప్రయాణంలో క్రషర్ రోడ్డు మీదుగా యూటీ జంక్షన్ చేరుకొని కమ్మవారిపాలెం మీదుగా 52 ఎకరాల్లో ఉన్న టిడ్కో గృహ సముదాయం మీదుగా చిలకలూరిపేటకు చేరుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనదారులు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. చిలకలూరిపేట మీదుగా కోటప్పకొండకు చేరుకునే భక్తుల కోసం ట్రాఫిక్ అవాంతరాలు ఏర్పడకుండా ప్రతిచోట పోలీసులు పర్యవేక్షణ కొనసాగుతుందని వెల్లడించారు. తిరునాళ్ల సందర్భంగా భక్తులు అప్రమత్తంగా మెలగాలని ఆయన సూచించారు. పెద్ద సంఖ్యలో జనం రానున్న నేపథ్యంలో దొంగలు సంచరించే అవకాశం ఉందని, భక్తులు విలువైన వస్తువులను జాగ్రత్త చేసుకోవాలని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల సూచనల మేరకు విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వివిధ సంస్థలలో ప్రత్తిపాటి ఎన్నికల ప్రచారం


బ్యాంకులలో సిబ్బందిని కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసినందున, కూటమి నాయకులు, కార్యకర్తలు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, సాధికారమిత్రలు పోలింగ్ రోజున ఎంతో అప్రమత్తతతో వ్యవహరించాలని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం సూచించారు. ప్రచార సమయం ముగియడానికి ముందు పట్టణంలోని పలు ప్రైవేట్ బ్యాంకుల సిబ్బందిని, ప్రభుత్వ విభాగాల సిబ్బందిని, అసిస్ట్ సంస్థ సభ్యులను కలిసి ఎన్నికలలో ఆలపాటికి మద్దతు తెలపాలని అభ్యర్థించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇప్పటి వరకు జరిగిన ప్రచారంపై సమీక్షించారు. పోలింగ్ రోజున చివరి ఓటు పోలయ్యేవరకు అప్రమత్తతతో వ్యవహరించాలని కోరారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పోలంరెడ్డి దినేష్ రెడ్డి, కూటమి నాయకులు జయరామిరెడ్డి, టీడీపీ నాయకులు జె మదన్ మోహన్, షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, నరసింహారావు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: ఈ నెల 27న జరగనున్న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను పట్టభద్రులంతా తొలి ప్రాధాన్య ఓటేసి గెలిపించాలని బీజేపీ మండలాధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, శావల్యాపురం, పోట్లూరు, వేల్పూరు జడ్పీ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలను బీజేపీ నేతలు మంగళవారం సందర్శించి ఆలపాటికి మద్దతునివ్వాలని ఉపాధ్యాయులను కోరారు. కూటమినేతలు దివ్యకోలు నాగేశ్వరరావు, నాదెండ్ల నరసింహారావు, గుంజ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాగులవరం పాఠశాలకు లక్ష విరాళం


ప్రిన్సిపాల్ రామును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రన్నింగ్ ట్రాక్ నిర్మాణానికి బాలాజీ హైస్కూల్ ప్రిన్సిపాల్ రాము రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. మంగళవారం నాగులవరం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సంతమాగులూరు బాలాజీ హైస్కూల్ ప్రిన్సిపాల్ రాము, ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షణ్మోహనరావు, ఎల్ఐసీ రమణారెడ్డి, లింగారెడ్డి, లోకేష్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ రాజశేఖరరెడ్డి, పీఈటీ అంకారావులు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు అందజేశారు. పాఠశాల అభివృద్ధి నిమిత్తం గ్రామానికి చెందిన ఎల్ఐసీ రమణారెడ్డి రూ.20వేలు, ప్రశాంత్ రూ.15వేలు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షణ్మోహనావు దాతలను సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

నూజెండ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే బాలికలకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాల వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాలు ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. 10వ తరగతి విద్యార్థులకు గంగినేని ఫౌండేషన్ చైర్మన్, త్రిపురాపురం డీసీ చైర్మన్ గంగినేని రాఘవ 10వ తరగతి విద్యార్థులకు 10వ తరగతి మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో అనురాధ, ఎంపీడీవో ఉమాదేవి, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఉషారాణి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం పరిశీలన

నూజెండ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్న నూజెండ్ల జడ్పీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ జీ రమేష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ నుంచి వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. మండలంలో పట్టభద్రులు 1011 ఓట్లు ఉండగా ఒకటి నుంచి ఆరు వందల వరకు 365వ బూత్‌లో, 601 నుంచి 665/ఏలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పోలింగ్ జరుగుతుందన్నారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

నూజెండ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీ పద్మజ అన్నారు. 2025 - 26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో మార్చి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20వ తేదీన నూజెండ్ల మోడల్ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

ఈకేవైసీ తప్పని సరి: ఏవో వరలక్ష్మి

వినుకొండ, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఏనుగుపాలెంలో రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని వరలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో రైతు పండిస్తున్న కంది, మొక్కజొన్న, వరి, మిరప, పొగాకు పంటను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు అందచేశారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏవో వరలక్ష్మీ మాట్లాడుతూ తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తప్పనిసరిగా ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు.



వేల్పూరులో బాధితులను విచారిస్తున్న మండల ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి

వేల్పూరులో ఫిర్యాదులపై విచారణ

● ఆంధ్రజ్యోతి కథనంతో కలెక్టర్ ఆదేశం

వేల్పూరు (శావల్యాపురం) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు రెవెన్యూ పరిధిలో గతంలో జరిగిన రీ సర్వే పనుల్లో పలు అక్రమాలు జరిగినట్లుగా మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి, ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యలను విచారణకు ఆదేశించారు. దీంతో వేల్పూరు సచివాలయంలో మంగళవారం బాధితులను విచారించారు. రీ సర్వేలో నమోదైన తప్పులు సవరణ చేసేందుకు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ నగదు తీసుకోవటంపై బాధితులనుంచి లిఖితపూర్వకంగా వారి వివరణలను సేకరించారు. వేల్పూరు సచివాలయం-2లో విధులు నిర్వహించాల్సి ఉండగా సచివాలయం-1లో ఎందుకు కూర్చుంటున్నావని వీఆర్వోని ప్రత్యేకాధికారి ప్రశ్నించగా ఆమె మిన్నకుండిపోయారు. రెవెన్యూకి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణపై డిజిటల్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ దరకాస్తులు సచివాలయం-2లోనే నమోదు చేయించాలని, అత్యవసరమైతే డిజిటల్ అసిస్టెంట్ లాగిన్‌ను తీసుకొని వీఆర్వోనే నమోదు చేయాలని, మరోసారి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కొందరు గ్రామస్థులు సచివాలయం వద్దకు వచ్చి డిజిటల్ అసిస్టెంట్ పనితీరుపై అధికారుల ఎదుటే తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విచారణకు సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేసి ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకొంటామని ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి తెలిపారు. వీరితోపాటు రీసర్వే డీటీ నాసరయ్య, సీనియర్ అసిస్టెంట్ చంద్రబాబు పాల్గొన్నారు.

జగన్ తీరుపై సొంత పార్టీవారే తలలు పట్టుకుంటున్నారు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అయిదేళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, ప్రజల పక్షాన గొంతెత్తడానికి హోదాలు, గౌరవాలు అడగడం సిగ్గుచేటని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రజలు తనకు ఇవ్వనిది, రాజ్యాంగబద్ధంగా తనకు దక్కదని తెలిసి కూడా ప్రతిపక్షహోదా కోసం వెంపర్లాడుతున్న జగన్‌ను చూసి సొంతపార్టీవారే తలలు పట్టుకుంటున్నారని ఆయన విమర్శించారు. పట్టుమని 10 నిమిషాలు స్థిమితంగా గవర్నర్ ప్రసంగం వినని వ్యక్తి, ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం ఆయనలో దాగి ఉన్న భయాన్ని సూచిస్తోందని ఆన్నారు. వైసీపీసభ్యులు గతంలో సభలో చంద్రబాబు చుట్టూచేరి అయన్ని మాటలతో, సైగలతో రెచ్చగొట్టినా ఏమాత్రం సంయమనం కోల్పోకుండా, హుందాగా, గౌరవంగా, ప్రజలపక్షాన తనవాణిని బలంగా వినిపించారని పేర్కొన్నారు. 1984 లోక్‌సభ ఎన్నికల తర్వాత టీడీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా లేకపోయినా ప్రజలపక్షాన పోరాడారన్నారు.

టీడీపీలోకి వైసీపీ ముస్లిం కార్యకర్తలు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మైనారిటీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, జగన్ వారిని నమ్మించి వంచించాడని శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మాజీ కౌన్సిలర్ వేటపాలెం సుభానితో పాటు 50మందికి పైగా వైసీపీ ముస్లిం నాయకులు, కార్యకర్తలు ప్రత్తిపాటి సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ, జగన్ ఐదేళ్ల పాలనలో మైనారిటీలకు జరిగిన అన్యాయం, ద్రోహం రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ జరగలేదన్నారు. మైనారిటీల సంక్షేమానికి ఖర్చుచేయాల్సిన నిధులను జగన్ సర్కార్ నవరత్నాలకు మళ్లించి, వారికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో మైనారిటీలకు ప్రత్యేకంగా అమలుచేసిన అనేక పథకాలను జగన్ రద్దుచేశాడన్నారు. ఆఖరికి వక్ఫ్ భూముల్ని వైసీపీ నేతలు ఆక్రమించుకున్నా జగన్ పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. తాజాగా ఇమామ్, మౌజన్ లకు జీతాల చెల్లింపు పథకాన్ని చంద్రబాబు పునః ప్రారంభించారన్నారు. ముస్లింల హక్కుల్ని కాపాడే విషయంలో కూటమిప్రభుత్వం రాజీపడబోదని పుల్లారావు స్పష్టం చేశారు. టీడీపీలో చేరిన వారిలో వేటపాలెం కరిముల్లా, ఉస్మాన్, వరపర్ల కరిమల్లా, అబ్దుల్ రెహమాన్, మస్తాన్ వలి, రఫీ, జానీ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ టీడీపీ కరీముల్లా, నెల్లూరి సదాశివరావు, పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, క్లస్టర్ ఇన్చార్జి ముల్లా కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ సమస్యలపై సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ సురేష్

రెవెన్యూ సేవలు త్వరితగతిన అందించాలి

● తహసీల్దార్ సురేష్

వినుకొండ టౌన్. ఫిబ్రవరి 25, (అంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సురేష్ ఆధ్వర్యంలో వినుకొండ మండలం, పట్టణంలో పనిచేస్తున్న రెవెన్యూ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రధానంగా రీ సర్వే సమస్యలతో పాటు, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఇళ్లుకట్టిన వాటిని రెగ్యులర్ చేయటం, ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలను అందించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురైన సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించి వెంటనే సమస్యలు పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.